సాక్షి
ఒడిశా

బుధవారం । 22 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,41,516లు, బంగారం 25 గ్రాములు, వెండి 19 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

నలుగురు బీజేడీ ఎమ్మెల్యేలకు అనర్హత తాఖీదులు



పార్టీ ఫిరాయింపుల కారణంగా అనర్హులుగా ప్రకటించేందుకు వివరణ కోరుతూ రాష్ట్ర శాసనసభ మంగళవారం నలుగురు బీజేడీ ఎమ్మెల్యేలకు తాఖీదులు జారీ చేసింది.

- 8లో



ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ మంగళవారం పరిశీలించారు.

- 8లో

రాష్ట్రానికి భారీ వర్ష సూచన

- మూడో దశ పోలింగ్‌పై ప్రభావం
- భారత వాతావరణ శాఖ అంచనా
- 25న జరగనున్న పోలింగ్



భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ పూర్తి కావడంతో తదుపరి మూడో దశ పోలింగ్ సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 25న మూడో దశ పోలింగ్ జరగనుంది. ఈ విడతలో సంబల్‌పూర్, కెంజొహర్, ఢెంకనాల్, పూరీ, భువనేశ్వర్, కటక్ పార్లమెంట్ నియోజకవర్గాలు, అనుబంధ శాసనసభ స్థానాల్లో ఏకకాలంలో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మూడో దశ పోలింగ్ నాటికి ఆయా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది.

అల్పపీడనం ప్రభావంతో...

రాష్ట్రంలో అల్పపీడనం తీవ్రమయ్యే సంకేతాలను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) జారీ చేసింది. దీనిలో భాగంగా ఈనెల 20 నుంచి 24 వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం సంభవించవచ్చు. ఆ తర్వాత ఈనెల 25 నుంచి 28 వరకు ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో అత్యధిక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా మోస్తరు వర్షపాతం కురుస్తుందని ఐఎండీ అంచనా. ద్రోణి ప్రభావంతో ఈనెల 24, 25 తేదీల్లో ఉత్తర ఒడిశాలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఈనెల 24వ తేదీన...

ఈనెల 24వ తేదీన జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడాలో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, మయూర్‌భంజ్, కెంజొహర్, కటక్ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయి. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులతో కూడిన గాలివేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లకు చేరుకునే అవకాశం ఉంది. పూరీ, ఖుర్దా, నయాగడ్, గంజాం, గజపతిలో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుము, మెరుపులతో కూడిన వర్షం, గాలివేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల ఉంటుంది. తీరప్రాంత ఒడిశాలో మయూర్‌భంజ్, కెంజొహర్, అంగుల్, ఢెంకనాల్, మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, కంధమల్, బౌధ్ జిల్లాల్లోని కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది.

ఈనెల 25వ తేదీన...

ఈనెల 25వ తేదీన బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, మయూర్‌భంజ్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. జగత్‌సింగ్‌పూర్, కటక్, జాజ్‌పూర్, కెంజొహర్‌లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయి. ఉత్తర ఒడిశా, దక్షిణ కోస్తా ఒడిశాలోని అనేక చోట్ల, నువాపాడ, బొలంగీర్, సోన్‌పూర్, బౌధ్, కంధమల్ ప్రాంతాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ సమాచారం.

మత్స్యకారులకు హెచ్చరిక

ఈనెల 22 నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి 24వ తేదీ ఉదయం నాటికి మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో 23వ తేదీ ఉదయం నుంచి మధ్య బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ వాతావరణం మే 24 నుంచి ఉత్తర బంగాళాఖాతం పరిసర ప్రాంతాలకు విస్తరిస్తుంది. ఈ వ్యవధిలో గాలుల వేగం 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, 70 కిలోమీటర్ల వరకు బలం పుంజుకునే ప్రమాదం పొంచి ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం. మే 23 నుంచి మధ్య బంగాళాఖాతం మీదుగా, మే 24 నుంచి ఉత్తర బంగాళాఖాతం మీదుగా సముద్ర పరిస్థితి చాలా అల్లకల్లోలంగా ఉంటుంది. మత్స్యకారులు మే 23 నుంచి మధ్య బంగాళాఖాతంలోకి, మే 24 నుంచి ఉత్తర బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు మే 23లోపు తీరానికి తిరిగి రావాలని సమాచారం ప్రసారం చేసింది.

న్యూస్‌రీల్

రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు



మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నేతలు

జయపురం: దేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానిక కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ భవనంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను, పేదరిక నిర్మూలనకు ఆయన చేపట్టిన పథకాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ చీఫ్ సుకాంత పట్నాయిక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి దేవేంద్ర బాహినీపతి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు రామ నాయిక్, బూత్ కాంగ్రెస్ నేత చిన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న మహిళలు



భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

జయపురం: నవరంగపూర్‌లో విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో వివిధ దేవతామూర్తులకు భక్తులు పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు స్వామివారికి అభిషేకం, కుంకుమ పూజ, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఉత్సవాలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

నదిలో మునిగి యువకుడు మృతి



సాయిరాజు మృతదేహం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి బాగుసల గ్రామం వద్ద మహేంద్రతనయ నదిలో జారిపడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం కోసమాళ గ్రామానికి చెందిన టి.సాయిరాజు (25) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోసమాళ గ్రామానికి చెందిన టి.సాయిరాజు బాగుసల గ్రామానికి స్నేహితులతో కలిసి సొంత పని మీద వెళ్లాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో కుంభరాణి అమ్మవారి గుడి వద్ద మహేంద్రతనయ ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి నదిలో కాలుజారి పడి మునిగిపోయాడు. దీంతో నది వద్ద ఉన్న యువరాజపూర్ గ్రామస్తులు వెతికి బయటకు తీసుకొచ్చారు. కాగా అప్పటికే సాయిరాజు మృతి చెందాడు. విషయం తెలియడంతో ఐఐసీ రవీంద్ర పాత్రో సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటీ నుంచి రూ.80 వేలు చోరీ



డబ్బులు పోగొట్టుకున్న నర్సింగ మిశ్రా

పర్లాకిమిడి: స్థానిక మొక్కతోటమ్మ గుడి, విశ్వనాథ నగర్ వద్ద పార్క్ చేసి ఉన్న స్కూటీ నుంచి రూ.80వేలు చోరీ చేశారు. విశ్రాంత ఉద్యోగి నర్సింగ మిశ్రా స్థానిక కాలేజ్ జంక్షన్ మెయిన్ బ్యాంచి స్టేట్ బ్యాంక్ నుంచి మంగళవారం రూ.80 వేలు విత్‌డ్రా చేశారు. తన సోదరుడు నివశిస్తున్న విశ్వనాథనగర్‌లోని ఇంటికి వెళ్తూ బయట స్కూటీ ఉంచారు. తిరిగి బయల్దేరుతుండగా స్కూటీ డిక్కీని విరిగిపోయినట్లు గమనించారు. అందులో ఉన్న రూ.80వేలు మాయమైనట్లు గమనించి లబోదిబోమన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరాటే పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన రమేష్

రాయగడ: మలేసియాలోని పెర్క్ ఎలీనా స్టేడియంలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన 20వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో రాయగడ యువకుడు సత్తా చాటాడు. భారత్ తరుపున ఈ పోటీల్లో పాల్గొన్న ఎల్.రమేష్ కుమార్ 50 కిలోల కేటగిరిలో బంగారు పతాకాన్ని సాధించాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో మలేసియా, ఇండోనేషియా, సింగపూర్ వంటి దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. బంగారు పతకాన్ని సాధించి తిరిగి స్వగ్రామానికి మంగళవారం వచ్చిన రమేష్ కుమార్‌కు స్థానిక సాక్ష్యం అనే సంస్థ ఘనంగా స్వాగతం పలికింది. రైల్వేస్టేషన్‌లో ఆయనకు స్వాగతం పలికినవారిలో జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనర్, తెరువలిలోని ఇంఫా పరిశ్రమ పీఆర్వో శక్తి కుమార్ పాణిగ్రహి, బృందావన్ బెహర, శ్యామ్‌దాస్, దివ్యా పండ తదితరులు ఉన్నారు. దివ్యాంగుడైన రమేష్ కరాటే వంటి క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడంపై అందరూ అభినందనలు తెలియజేశారు.



రమేష్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

బొరిగుమ్మలో దొంగల స్వైర విహారం



ఉపాధ్యాయురాలి ఇంటిలో తెరిచి ఉన్న బీరువా

జయపురం: బొరిగుమ్మలో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. ఈ నెల 14 వ తేదీన బొరిగుమ్మ నీలకంఠ మందిరం సమీపంలో ఒక వ్యక్తి మోటారు బైక్ దొంగిలించిన విషయం విదితమే. ఈ సంఘటనలో నిందితులు పట్టుబడక ముందే సోమవారం రాత్రి ఒక ఉపాధ్యాయురాలి ఇంటిలో పెద్ద దొంగతనం జరిగింది. ఆ ఇంటిలో ఎవరూ లేని సమయంలో దొంగలు ఆమె ఇంటి గ్రిల్, తలుపుల తాళాలు విరిచి లోనికి ప్రవేశించారు. ఆమె ఇంటిలో 150 తులాల వెండి ఆభరణాలు, ఒక టేబుల్ ఫ్యాన్, స్కూటీలు దొంగిలించారు. బొరిగుమ్మ హేమంత వీధిలో ఉపాధ్యాయుడు ఘాశీరాం సాహు ఇంటిలో ఉపాధ్యాయురాలు టి.రాణి దొర అద్దెకు ఉంటున్నారు. వేసవి సెలవుల కారణంగా రాణి దొర తన సొంత గ్రామం బరంపురం వెళ్లారు. ఆమె ఇంటిలో లేని సమయంలో దొంగతనం జరిగింది. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసి చుట్టుపక్కల వారు ఆమెకు సమాచారం అందజేశారు. బొరిగుమ్మ పోలీసు అధికారి జుగళ్ కిశోర్ సాయె, ఏఎస్‌ఐ రజిత మడకామిలు పోలీసు సిబ్బందితో వచ్చి ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు పోలీసు అధికారి జుగుల్ కిశోర్ సాయె వెల్లడించారు.

3 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి

జయపురం: గంజాయి అక్రమ రవాణా గుట్టును పోలీసులు రట్టుచేశారు. కొరాపుట్ జిల్లా దమంజోడి పోలీసులు రెండు కార్లలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ప్రమీళ బిడిక మంగళవారం తెలిపారు. పట్టుబడిన గంజాయి మూడు క్వింటాళ్ల మూడు కేజీలు ఉన్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారు రాయగడ జిల్లా పుటాసింగ్ పోలీసు స్టేషన్ పరిధి నువాద గ్రామానికి చెందిన సునీల్ నిమల, గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి పరిధి బురిపాదర్‌కు చెందిన నిర్బిగా గుర్తించినట్టు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రెండు ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణపై విశ్వసనీయవర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం సబ్‌ఇన్‌స్పెక్టర్ దీపక్ పండ నేతృత్వంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా విషయం వెలుగు చూసిందని స్పష్టం చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



పొట్టంగి సమీపంలో చెట్టుకు ఢీకొన్న వ్యాన్

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

జయపురం: జయపురం పరిధిలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. కొరాపుట్ జిల్లా 26వ జాతీయ రహదారిలో పొట్టంగి సమితి పుకాళీ గ్రామ కూడలి సమీపంలో కొబ్బరి కాయలు రవాణా చేస్తున్న ఒక వ్యాన్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్పర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కుందులి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడిని షేక్ ఆర్సిచ్(47)గా గుర్తించారు. ఈ వ్యాన్ ఆంధ్రా నుంచి వస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన వల్ల ఆ దారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నవరంగపూర్ పోలీసు స్టేషన్ పరిధి కేశరీ గుడ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దు మృతి చెందారు. వీరిని పడాల్‌గుడ పంచాయతీ నీలకంఠగుడ గ్రామానికి అభి జాని(25) గెల గదబగుడ గ్రామానికి చెందిన చందన గదబ(19)లుగా గుర్తించారు. పడాల్‌గుడ గ్రామంలో జరుగుతున్న బలిజాతరను చూచేందుకు అభి జాని, చందన గదబలు రెండు బైక్‌లపై వెళ్లారు. జాతర ముగిశాక గ్రామానికి తిరిగి వస్తుండగా కేశరీగుడ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రెండు బైక్‌లపై నలుగురు ప్రయాణిస్తున్నారని, అందరూ తీవ్రంగా గాయపడ్డారని వారిని నవరంగపూర్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఇక్కడ అభి మృతి చెందగా చందనను కొరాపుట్ తరలిస్తుండగా అక్కడ సహిద్ లక్ష్మణ నాయిక్ ఆస్పత్రిలో మృతి చెందాడు.



నవరంగపూర్ సమీపంలో ప్రమాదానికి గురైన బైక్‌లు

ఉచిత విద్యుత్‌పై అదే మాట



ఉప్పొంగిన ఆనందోత్సాహం



ప్రజలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభివాదం



నవీన్ రోడ్ షోలో పలు రకాల సంప్రదాయ నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న యువతరం

- భువనేశ్వర్‌లో నవీన్ రోడ్ షో
- ఉచిత విద్యుత్ హామీ పునరుద్ఘాటన

భువనేశ్వర్: అధికారంలోకి వస్తే జూలై నుంచి కరెంటు బిల్లులు ఉండబోవని బిజూ జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ తమ పార్టీ హామీని పునరుద్ఘాటించారు. సోమవారం రాత్రి నగరంలో జరిగిన మెగా రోడ్‌షోలో మాట్లాడిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బీజేడీ ఎన్నికల వాగ్దానాన్ని పునరుద్ఘాటించారు. ఆయనకు స్వాగతం పలికేందుకు రోడ్ షో మార్గంలో ఇరువైపులా వేలాది మంది ప్రజలు గుమిగూడారు. ప్రియతమ నేత నవీన్ పట్నాయక్ చేతులెత్తి అభివాదం చేసి రోడ్ షోకు హాజరైన ప్రజల్ని ఆనందోత్సాహాల్లో ముంచెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి తన పార్టీ నిబద్ధతను నవీన్ పట్నాయక్ పునరుద్ఘాటించారు. వారం రోజుల స్వల్ప వ్యవధిలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నగరంలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొనడం వరుసగా ఇది రెండోసారి. రోడ్ షో స్థానిక పలాసపల్లి పున్నమ్మ గేట్ ఫ్లై ఓవర్ నుంచి ఏకామ్ర చౌరస్తా వరకు సాగింది. ఇది బీడీఏ కాలనీ స్క్వేర్, సుందర్‌పద సంత, పాఖోరిపుట్ స్క్వేర్, ప్రమేయ స్క్వేర్, సిరిపూర్ ఛక్, గంగానగర్ స్క్వేర్ మరియు రాజేంద్ర విహార్ మీదుగా ఏకామ్రా స్క్వేర్ గుండా జరిగిన రోడ్ షోలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ

సామాన్య ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ముఖ్యమంత్రి రోడ్ షో సందర్భంగా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించినట్లు కమిషనరేట్ పోలీస్ ట్రాఫిక్ డీసీపీ తెలిపారు.

డ్రాపౌట్స్ నివారణకు చర్యలు



ఆర్.ఉదయగిరిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

- గ్రామాల్లో విద్యాశాఖ అధికారుల సర్వే



గుమ్మా సమితి అజయగడ గ్రామంలో సమావేశమైన అధికారులు



గుమ్మాసమితి గైల గ్రామంలో సమావేశమైన దృశ్యం

పర్లాకిమిడి: విద్యార్థుల్లో డ్రాపౌట్స్ నివారణకు విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. గజపతి జిల్లాలోని ఆర్.ఉదయగిరి, గుమ్మా సమితిల్లోని మారుమూల గ్రామాల్లో ఆరు నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థుల్లో డ్రాపౌట్స్ నివారించేందుకు ఆకాంక్ష సంస్థతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంగా పరిమళ్ ఫౌండేషన్ ముందుకువచ్చింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, క్లస్టర్ లెవల్ కోఆర్డినేటర్లు, సూపర్‌వైజర్లు, శిశువికాస్ యోజనా అధికారులతో గుమ్మా, ఆర్.ఉదయగిరి సమితిల్లో మంగళవారం సర్వే చేపట్టారు. స్కూల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న మధ్యాహ్నభోజన పథకం, యూనిఫారాలు, స్మార్ట్‌క్లాస్, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో సౌకర్యాలు వంటి వివరాలు వివరించారు. ఆర్.ఉదయగిరి, గుమ్మా బ్లాక్‌లో సర్వే అనంతరం డ్రాపౌట్స్ విద్యార్థుల జాబితాను ఆర్.ఉదయగిరి సమితి బీడీవో లారీమెస్ ఖర్సల్, శిశు వికాస్ యోజనా అధికారి లలిత పూజారీలకు అందజేస్తామని పరిమళ్ ఫౌండేషన్ అధికారి శ్రేయాశిరాణి, శుభ సంజోగ్ సాహులు చెప్పారు. సర్వేలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అలేమీ రైకా, శుభం కుమార్, అనంత జుజ్ఞా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తులకు పండ్లు వితరణ



భక్తులకు పండ్ల ముక్కలను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని స్థానిక యువజన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగౌరి మందిరానికి వచ్చిన భక్తులకు కర్బూజ పండ్లను మంగళవారం పంపిణీ చేశారు. మందిర ప్రాంగణంలో ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేసిన క్లబ్ సభ్యులు పండ్లను అందించారు. క్లబ్ అధ్యక్షులు కె.వంశీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్.గౌరీ శంకర్, ఎస్.సుభాషిణిల సౌజన్యంతో వీటిని పంపిణీ చేసినట్టు అధ్యక్షులు తెలిపారు.

రథయాత్ర కమిటీ సమావేశం నేడు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాలులో బుధవారం ఉదయం 10.30గంటలకు రథయాత్ర కమిటీ సమావేశం జరగనుందని సబ్ కలెక్టర్ అలోక్ పండా తెలియజేశారు. సమావేశానికి రోడ్డు-భవనాల శాఖ ఈఈ, ప్రజాఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

'ప్రతి బోటుకు జీపీఎస్ తప్పనిసరి'



లైఫ్ జాకెట్ల వాడకంపై అవగాహన కల్పిస్తూ..

గార: ప్రతి బోటుకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలని మత్స్యశాఖ ఏడీ ఎ.సంతోష్‌కుమార్ అన్నారు. బందరువానిపేట గ్రామంలో మత్స్యశాఖ, కోస్టుగార్డు, మెరైన్ సంయుక్తంగా వేటకు వెళ్లే మత్స్యకారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోటులో తప్పనిసరిగా మొబైల్ ఫోన్ తీసుకువెళ్తున్నారని, జీపీఎస్ మొబైల్‌లోనే ఉంచుకోవాలన్నారు. వేటకు వెళ్లే ప్రతి బోటు రిజిస్ట్రేషన్ కచ్చితంగా ఉండటంతో పాటు ఎరుపు రంగు వస్త్రాన్ని తీసుకువెళ్లాలన్నారు. సముద్రంలో జీపీఎస్ నిలిచిపోయినా, వాతావరణంలో మార్పులు జరిగినా, ఎలాంటి ఇబ్బంది ఏర్పడినా ఎరుపు వస్త్రాన్ని బోటుపై నుంచి ఎగురవేయాలన్నారు. ఈ జెండాను కోస్టుగార్డు సిబ్బంది గమనించి అవసరమైన చర్యలు తీసుకోడానికి అవకాశం ఉంటుందని వివరించారు. బోటు యజమానులు ప్రభుత్వం సూచించిన రంగులను బోటుకు వేయాలని సూచించారు. బోటులో లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ఉంచేలా చూడాలని, మత్స్యకారులకు రక్షణకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు ఉంటాయని, ఆ సమయంలో వేటకు వెళ్లే మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళింగపట్నం మెరైన్ స్టేషన్ సీఐ నారీమణి, ఎస్ఐ మహాలక్ష్మి, కోస్టుగార్డు సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ హేమసుందర్, సాగర మిత్రలు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ముగియనున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీ సెట్ మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఈ నెల 16వ తేదీ నుంచి కొనసాగుతున్న పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్నాయి. బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు 16, 17 తేదీల్లో జరగ్గా, ఈ నెల 18వ తేదీ నుంచి ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారం నాటికి 10,286 మందికి 9,700 మంది హాజరు కాగా, 586 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 2076 మందికి 1974 మంది హాజరు కాగా, 102 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్‌లో మొదటి షిఫ్టులో 329కి 312, రెండో షిఫ్టులో 330కి 311 మంది హాజరయ్యారు. టెక్కలి ఐతం కళాశాలలో మొదటి షిఫ్టులో 300 కి 288, రెండో షిఫ్టులో 300 కి 290 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టులో 230కి 215, రెండో షిఫ్టులో 229కి 218 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టులో 179కి 167, రెండో షిఫ్టులో 179కి 173 మంది హాజరయ్యారు.

క్రీడా మైదానంలో ఆస్తి ధ్వంసం

పలాస: పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో ప్రజల సహకారంతో కొత్తగా ఏర్పాటు చేసిన క్రీడామైదానంలో గల కుర్చీలు, బెంచీలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ దుశ్చర్యను క్రీడామైదానం కమిటీ తీవ్రంగా పరిగణించింది. మూడెకరాల విస్తీర్ణంలో గత ఈ క్రీడా మైదానాన్ని ఆటలకు అనువుగా తీర్చిదిద్ది క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన కాంక్రీటు బెంచీలు, కుర్చీలను విరగ్గొట్టారు. సుమారు రూ.20లక్షల పెట్టుబడితో ఈ మైదానాన్ని అందంగా తీర్చి దిద్దారు. ఈ సంఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కాశీబుగ్గ పోలీసులను కోరారు.

నలుగురు బీజేడీ ఎమ్మెల్యేలకు అనర్హత తాఖీదులు



పరశురామ్ ధొడొ



సమీర్ రంజన్ దాస్



సీమారాణి నాయక్



రమేష్ చంద్ర సాయి

భువనేశ్వర్: పార్టీ ఫిరాయింపుల కారణంగా అనర్హులుగా ప్రకటించేందుకు వివరణ కోరుతప రాష్ట్ర శాసన సభ మంగళవారం నలుగురు బీజేడీ ఎమ్మెల్యేలకు తాఖీదులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఈ నలుగురు ఇటీవల బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణ. అనర్హత వేటుకు చేరువలో ఉన్న నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో సమీర్ రంజన్ దాస్, సీమారాణి నాయక్, రమేష్ చంద్ర సాయి, పరశురామ్ ధొడొ ఉన్నట్లు అధికార వర్గాల విశ్వసనీయ సమాచారం. వీరందరినీ శాసన సభ్యత్వం నుంచి తొలగించేందుకు సంతృప్తికరమైన వివరణ దాఖలు చేసేందుకు ఈ నెల 27 వరకు గడువు కల్పించారు.

స్పీకరు ఆదేశాలతో..

ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత కుమార్ ముదులి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పీకర్ విచారణ చేపట్టారు. విచారణ పురస్కరించుకుని పూర్వాపరాలు పరిశీలించిన మేరకు స్పీకరు జారీ చేసిన ఆదేశాల ఆధారంగా శాసన సభ కార్యదర్శి నలుగురు నిందిత సిట్టిగ్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు.

నిమాపడా అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సమీర్ రంజన్ దాస్, హిందోల్ సిటింగు ఎమ్మెల్యే సీమారాణి నాయక్, అఠొమల్లిక్ నియోజక వర్గం ఎమ్మెల్యే రమేష్ చంద్ర సాయి మరియు సొరొ నియోజక వర్గం ఎమ్మెల్యే పరశురామ్ ధొడొ అనర్హత వేటుకు సంబంధించి గడువు లోగా వివరణ దాఖలు చేయాల్సి ఉంది. ఈ నలుగురు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలకు పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో అధికార పక్షం బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వీరిలో కొందరు భారతీయ జనతా పార్టీలో చేరి భారతీయ జనతా పార్టీ అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. గతంలో ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అధికార బీజేడీ నుంచి వైదొలిగి బీజేపీలో చేరిన అరబింద ధాలీ, ప్రేమానంద నాయక్‌లపై స్పీకర్ ప్రమీలా మల్లిక్ అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే.

అమలాభట్టలో న్యాయ సచేతన శిబిరం



అవగాహన కల్పిస్తున్న సుమన్ జెన

జయపురం: సమితి పరిధిలోని అమలభట్టా గ్రామంలో కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సచేతన శిబిరం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం హెల్ప్‌లైన్, ప్రభుత్వ సహాయం, ఇతర సౌకర్యాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవా ప్రదీకరణ జిల్లా కార్యదర్శి సుమన్ జెన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రజలకు వివరించారు. అలాగే పిల్లల పెంపకం, వారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. బాల్య వివాహాలు వలన జరిగే అనార్థాలను తెలియజేశారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఇందులో భాగంగా గుణుపూర్ సబ్ కలక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ మంగళవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు రోజున చేపట్టాల్సి ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గుణుపూర్ విధాన సభ, కొరాపుట్ లోక్‌సభలో అంతర్భాగమైన గుణుపూర్ శాసనసభలకు సంబంధించి ఇక్కడ లెక్కింపు కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు, సీసీ కెమెరాల పరివేక్షణ తదితర విషయాలపై అధికారులతో సమాలోచన చేశారు. స్ట్రాంగ్ రూంలో నిక్షిప్తమైన ఈవీఎంల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. గుణుపూర్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్ మాఝి, తహసీల్దార్ నీలావతి ఆచార్య, బీడీవో ప్రద్యుమ్న మండల్ ఉన్నారు.

వరుస చోరీలతో భయాందోళన

సారవకోట: మండలంలో ఎప్పుడూ లేని విధంగా వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్చి 1న మండలంలోని చీడిపూడి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో నైట్ వాచ్ మెన్‌ను బెదిరించి మిల్లు కార్యాలయపు తాళాలు పగులగొట్టి మిల్లులో దాచిన రూ.1.30 లక్షలు దొంగిలించుకుపోయారు. ఆ మిల్లుకు సమీపంలో ఉన్న బుడితిలో అయ్యప్ప స్వామి ఆలయం, షిర్డీ సాయి ఆలయాల్లో సైతం దొంగలు చోరీలకు పాల్పడ్డారు. అలాగే మే నెల 1న బుడితి గ్రామంలో బొర శిమయ్య కుటుంబ సభ్యులు తాళాలు వేసుకుని బెంగళూరు వెళ్లగా దొంగలు ఇంట్లో చొరబడి ఇంట్లో ఉన్న వస్తువులు, బంగారం, నగదు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల కిందట ధర్మలక్ష్మీపురం గ్రామానికి సమీపంలో అనకాపల్లి జిల్లా మామిడి పల్లి గ్రామానికి చెందిన మణికంఠ అనే వ్యక్తి నుంచి తాము పోలీసులమని చెప్పి దుండగులు రూ.10 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇలా వరుసపెట్టి సంఘటనలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే మండల కేంద్రంలో పలువురు యువత గంజాయిని ఒడిశా నుంచి తీసుకొచ్చి పోలీసుస్టేషన్‌కు సమీపంలో ఉన్న పాఠశాల ఆవరణలో సేవిస్తున్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని, దొంగతనం కేసుల విషయంలోనూ పురోగతి సాధించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటు ప్రజాస్వామ్యానికి బలం



సంప్రదాయ దసకటియా సంకీర్తన ఆలాపనతో ఓటరు చైతన్య కార్యక్రమం

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటింగ్ శాతం గణనీయంగా పెంపొందించేందుకు ఖుర్దా జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఓటు హక్కు వినియోగం బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది నినాదంతో ఖుర్దా జిల్లా యంత్రాంగం పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నగర, పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ తక్కువగా ఉంటున్నట్లు గత పోలింగ్ విశ్లేషణ తేటతెల్లం చేసింది. ఈ పరిస్థితి నివారణ దిశలో ఖుర్దా జిల్లా యంత్రాంగం రాజధాని నగరం భువనేశ్వర్ వీధులు, ప్రధాన కూడలి ప్రాంతాల్లో సంప్రదాయ నృత్య, సంకీర్తన కార్యకలాపాలతో ఓటు వేసేందుకు అర్హులంతా కదలి రండి అని పిలుపునిస్తోంది. స్వీప్ ఆధ్వర్యంలో, ఖుర్దా జిల్లా ఎన్నికల అధికారి మంగళవారం నగరంలో 6 ప్రధాన ప్రదేశాల్లో సంప్రదాయ జానపద కళలైన ఘొడానచ్చొ (కొయ్య గుర్రం నృత్యం), దసకటియా ద్వారా ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



కనువిందు చేసే కొయ్య గుర్రం నృత్యంతో ఓటరు చైతన్య కార్యక్రమం

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

బూర్జ: మండలంలో గల కొరగాం గ్రామం ఆమదాలవలస-పాలకొండ ప్రధాన రహదారిపై మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పినివలస పంచాయతీ జంగాలపేట గ్రామానికి చెందిన కరణం మధుసూదన రావు కొరగాం పంచాయతీ బోరగ వలస గ్రామం నుంచి స్వగ్రామం జంగాల పేట వస్తుండగా.. కొల్లివలస వైపు నుంచి ఆమదాలవలస వైపు వస్తున్న రణస్థలం గ్రామానికి చెందిన లంక నారాయణ రావు బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో వీరిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 సాయంతో వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్ పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన విత్తనం.. మనదే పెత్తనం



- గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి ప్రోత్సాహం
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ శ్రీధర్
- కవిటి ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఖరీఫ్ వరిసాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ కె.శ్రీధర్

కవిటి:

రైతు స్థాయిలో విత్తనోత్పత్తి చేయగలిగితే మెరుగైన ఆదాయం లభించడంతో పాటు భవిష్యత్ తరాలకు సాగు సులభం అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ కె.శ్రీధర్ అన్నారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో బీవీకే రైతు ఉత్పత్తిదారుల సంఘం సౌజన్యంతో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 2024-25 ఖరీఫ్ వరిసాగు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఈ ఏడాది కవిటి మండలంలో ఎంపిక చేసిన రైతులకు 50 ఎకరాల్లో ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) వరి రకం విత్తనోత్పత్తి పథకం కోసం ఈ సమావేశంలో చర్చించారు.

సూచనలివే..

ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ విత్తనోత్పత్తి పథకం విధివిధానాలు రైతులకు వివరించారు.

- ఈ కార్యక్రమంలో భాగంగా 50శాతం రాయితీపై ఫౌండేషన్ సీడ్‌ను ఈ పథకంలో ఎంపికైన రైతులకు ముందస్తుగా అందిస్తామన్నారు.
- మూడు దశల్లో పంట చేతికి అందే వరకు ఏపీ సీడ్స్ సంస్థ సాంకేతిక సిబ్బంది రైతులకు నాణ్యమైన విత్తనోత్పత్తికి సూచనలు సలహాలు అందిస్తారని, పంట నాణ్యతను పరిశీలిస్తారని తెలిపారు.
- ఈ మూడుసార్లు ఏపీసీడ్స్ ప్రతినిధులు పంటపొలానికి రావడానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.
- ఏపీ సీడ్స్ నాణ్యతా ప్రమాణాలతో కూడిన మేలైన నాణ్యమైన విత్తనాలు అందించగలిగితే రైతులకు సంస్థ వారే స్వయంగా అధిక ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు బైబ్యాక్ అగ్రిమెంట్ కూడా చేస్తారని తెలిపారు.

తయారీ ఇలా..



నాణ్యమైన విత్తన తయారీలో ప్రాథమికంగా పాటించాల్సిన పద్ధతులపై సీనియర్ వ్యవసాయ సహాయసంచాలకులు పి.భవానీ శంకర్, కె.జగన్మోహన్‌రావు, సీనియర్ వ్యవసాయాధికారి బొర్ర నరసింహమూర్తి కీలకమైన సూచనలు చేశారు.

- విత్తనం నిల్వలో ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. వరి కోత కోసినప్పుడు నూర్పిడి సమయాల్లో యాంత్రిక కల్తీ నివారించాలి.
- విత్తనాన్ని ఎండబెట్టేటప్పుడు తేమ శాతం 13 శాతానికి మించకుండా ఉండాలి. కళ్లాల్లో యాంత్రిక కల్తీ లేకుండా చూడాలి.
- విత్తన నిల్వకు బాగా శుభ్రం చేసిన గోనె సంచుల్ని వాడాలి. వీలైనంత వరకు కొత్త సంచులను మాత్రమే ఉపయోగించాలి.
- గోనె సంచుల్లో నిల్వ చేసిన విత్తనాలను అధిక తేమ శాతం అధిక ఉష్ణోగ్రతకు గురి కాని గాలి వెలుతురు బాగా తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయాలి.
- విత్తనోత్పత్తి గ్రామస్థాయిలో గానీ, ఒక రైతు సహకార సంస్థ స్థాయిలో చేసేటప్పుడు ఒక ప్రాంత రైతులందరూ తమకు కావాల్సిన విత్తనాన్ని ముఖ్యంగా ఒకే రకానికి చెందిన ఉత్పత్తి చేయడం మంచిది.
- దీంతోపాటు నాణ్యమైన విత్తనం కోసం కొన్ని మెలకువలు పాటించాల్సి ఉంటుంది. విత్తన ఉత్పత్తి సారవంతమైన మంచినీటి వసతి ఉన్న పొలాల్లోనే చేపట్టాలి. లేకుంటే విత్తన నాణ్యత దెబ్బతింటుంది.
- విత్తనోత్పత్తి అంతకు ముందు పంట కాలంలో అదే రకం వేసిన పొలంలో లేదా వేరే పంట వేసిన పొలంలో సాగు చేయటం వల్ల స్వయం ఉత్పత్తి మొలకల వల్ల కల్తీ జరగకుండా జాగ్రత్త పడవచ్చు.
- రబీ కాలానికి విత్తన ఉత్పత్తి చేసే పొలాల్లో ఖరీఫ్ నుంచి నేలలో కలిసిన వరి గింజలు మొలకెత్తకుండా చేయటానికి దమ్ములో 10 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్పేట్ వేసి ఎనిమిది నుంచి పది రోజులు మురగబెట్టాలి.
- విత్తనోత్పత్తి చేసే పొలం చుట్టూ అదే పంటకు చెందిన వేరే రకం ఉంటే అంతర దూరం పాటించాలి.
- విత్తనోత్పత్తి విషయంలో ధ్రువీకరించిన వరి విత్తన నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి.
- జన్యు స్వచ్ఛత 98శాతం, భౌతిక స్వచ్ఛత 98 శాతానికి తగ్గకుండా ఉండాలి.
- జడ పదార్థం రెండు శాతం, మొలక శాతం కనీసం 80 శాతం ఉండాలి. తేమశాతం 13% ఉండాలి.
- పైపొట్టు లేని గింజలు రెండు శాతం మించకూడదు. ఇతర పంటలు లేదా రకాల విత్తనాలు కిలోకి 20 గింజలు మాత్రమే పరిమితం కావాలి. ఈ ప్రమాణాలు విధిగా పాటించాలి.
- విత్తన ఉత్పత్తిలో ప్రధానమైన అంశం పంటలో కేలీలను నివారించటం.
- ఈ కేలీల ఏరివేత ముఖ్యంగా మూడు దశల్లో చేపట్టాలి.
- ఒకటి పైరు దుబ్బు చేసే సమయం, రెండు పూత దశ, మూడు గింజ గట్టి పడినప్పుడు అంటే వరికోతకు ముందు...
- ఈ మూడు దశల్లో వ్యవసాయ శాఖ నిపుణులు సూచించిన మేరకు కేలీలను ఏరివేసే ప్రక్రియ విధిగా చేపట్టడం ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తికి మార్గం సుగమం అవుతుంది.
- కార్యక్రమంలో రైతులు బల్లెడ కృష్ణారావు, బెందాళం శ్రీరాంప్రసాద్, దుద్ది సతీష్, బల్లెడ జయప్రకాష్, పూడి ప్రసాద్, భావన చందనం తదితర రైతులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాలల జిల్లా ఇన్‌చార్జి ఎస్.బాలాజీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించామని, మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష రాసి సీటు పొందని విద్యార్థులకు, ప్రవేశ పరీక్ష రాయకుండా 10వ తరగతిలో పొందిన వారికి మార్కుల మెరిట్ ప్రాతిపదికన స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దపాడులో 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశం కోరే విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

బాలురు ఖాళీల వివరాలు

దుప్పలవలసలోని బైపీసీ గ్రూప్‌లో ఎస్సీ-04, బీసీ-01, కొల్లివలస బైపీసీ గ్రూప్‌లో బీసీ-01, కంచిలి బైపీసీ గ్రూప్‌లో బీసీ-01, ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ-01,ఎస్టీ - 01, బీసీ - 01, పాలకొండ ఎంఈసీ గ్రూప్‌లో ఎస్సీ - 31, ఎస్టీ- 02, బీసీ - 02, ఓసీ- 01, సి.ఇ.సి గ్రూప్ నందు ఎస్సీ - 16, ఎస్టీ-02, బీసీ - 02 ఖాళీలు కలవని తెలిపారు.

బాలికల ఖాళీల వివరాలు

తామరపల్లిలోని ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ - 11, ఓసీ- 01, బైపీసీ గ్రూప్‌లో ఓసీ - 01, పాతపట్నం ఎంపీసీలో ఎస్టీ - 01,ఓసీ- 01, వంగర బైపీసీ గ్రూప్‌లో బీసీ - 02, ఎంపీసీ గ్రూప్‌లో ఎస్టీ - 01, ఓసీ - 01, మందస ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ- 29, బైపీసీలో ఎస్సీ -12, నందిగాం సి.ఇ.సి గ్రూప్‌లో ఎస్సీ- 31, ఎస్టీ - 01, బీసీ - 02, ఓసీ - 01 మరియు ఎంఈసీ గ్రూప్ నందు ఎస్సీ- 34, ఎస్టీ - 03, బీసీ - 02, భామిని నందు సి.ఇ.సి గ్రూప్‌లో ఎస్సీ- 31, ఎస్టీ -01, బీసీ -02 ఓసీ -01, హెచ్.ఇ.సి గ్రూప్‌లో ఎస్సీ- 29, ఎస్టీ- 02,బీసీ-02 ఖాళీలు కలవు.

ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9701736862, 7569788629 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆశాజనకంగా పనస పంట

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్యాన పంటల్లో ఒకటైన పనస పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. ఉద్దాన ప్రజల జీవనాధారమైన జీడి పంట ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో పనస పంట దిగుబడి కలిసి రావడంతో రైతులకు కొంత ఊరట లభించింది. గత ఏడాది కంటే పనస పంట ఈ ఏడాది దిగుబడి బాగానే ఉందని రైతులు తెలిపారు.



అమ్మకానికి తరలిస్తున్న పనస కాయలు

సుభలయలో కార్డన్‌సెర్చ్

హిరమండలం: సుభలయలో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది సుభలయలో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా అల్లర్లకు, వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగులు కొనసాగితే సమాచారం అందించాలని సూచించారు. ఎక్కడైనా జూదాలు, పందాలు కొనసాగితే పోలీసు స్టేషన్‌కు కానీ, సచివాలయంలో కానీ తెలియజేయాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



హిరమండలం పోలీసులకు సూచనలిస్తున్న ఎస్ఐ నారాయణస్వామి

వాహనదారులకే పెట్రోల్, డీజిల్ విక్రయించాలి

కంచిలి: పెట్రోలు బంకుల వద్ద వాహదారులకు మాత్రమే పెట్రోల్, డీజిల్ విక్రయించాలని స్థానిక ఎస్ఐ వి.రాజేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్రో ఉత్పత్తులను బంకుల వద్ద లూజ్ సేల్స్ చేపట్టవద్దన్నారు. బాణా సంచా, టపాసులు అక్రమంగా తరలించడం, నిల్వ ఉంచడం నేరమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం నిల్వ ఉంచరాదని,అక్రమ రవాణా చేయరాదని, డీజే డ్యాన్సులు నిర్వహించడం నిషేధమని అన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగడం వంటివి చేయరాదని పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- కేంద్రాల్లో క్రియాశీలక పాత్ర సూపర్‌వైజర్లదే
- ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు
- జిల్లాలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఒకచోటే లెక్కింపు
- ఉల్లిభద్ర హార్టికల్చర్ కళాశాలలో ఏర్పాట్లు
- ఈవీఎంలకు మూడెంచల భద్రత
- కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ



ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన నిర్వహించనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఏర్పాట్లపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. కౌంటింగ్ ప్రక్రియలో సూపర్‌వైజర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఆర్‌ఓలు, ఏఆర్వోలు పర్యవేక్షక అధికారులుగా వ్యవహరిస్తారు. ఓట్ల లెక్కింపు కోసం నియమించిన అధికారులు, లెక్కింపు సిబ్బంది ఆరోజు తెల్లవారు జామున 4 గంటలకు కేంద్రానికి హాజరవుతారు. ర్యాండమైజేషన్ పూర్తయిన తరువాత సిబ్బంది తమకు కేటాయించిన కౌంటింగ్ హాల్లోకి ప్రవేశిస్తారు. అనంతరం అక్కడ ఆర్వో, ఏఆర్వో సూచనలను స్వీకరిస్తారు. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అంశంపై జాగ్రత్తలు తీసుకుంటూ ప్రక్రియ సజావుగా జరిగేలా ఆర్వోలకు సూపర్‌వైజర్లు తోడ్పాటు అందించేలా నిబంధనలు ఉన్నాయి.

అరకు పార్లమెంట్..

అరకు పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలకు చెందిన పోస్ట్ బ్యాలెట్ కౌంటింగ్ మాత్రమే కళాశాలలోని కాన్ఫరెన్స్ భవనంలో నిర్వహిస్తారు. ఈవీఎంలు మాత్రం సంబంధిత నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కిస్తారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు..

12-పార్వతీపురం నియోజకవర్గానికి ''ఎ'' బ్లాక్, 10-పాలకొండ నియోజకవర్గానికి ''ఎ'' బ్లాక్, 13-సాలూరు నియోజకవర్గానికి ''బి'' బ్లాక్, కురుపాం నియోజకవర్గానికి ''సి'' బ్లాక్‌లలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేలా కలెక్టర్, ఎన్నికల అధికారి చర్యలు తీసుకున్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఇలా..

గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర పరిధిలో గల ఉద్యాన కళాశాలలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

విధానాలు ఇలా పాటించాలి..

కౌంటింగ్ కేంద్రాల వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్లు నిర్వహించాల్సిన విధులు, పాటించాల్సిన విధానాల గురించి ఎన్నికల సంఘం స్పష్టంగా ఇలా తెలియజేసింది. ఓట్ల లెక్కింపు వద్ద కౌంటింగ్ ఏజెంట్లతో పిచ్చాపాటి మాట్లాడకూడదు. స్ట్రాంగ్ రూమ్ నుంచి తెచ్చిన ఈవీఎం బాక్స్‌లకు సీల్ పరిశీలించి తరువాత వాటిని టేబుల్ వారిగా దించాలి. 17సి ఫారం-1 కంట్రోల్ యూనిట్ నంబర్, పోలింగ్ స్టేషన్ నంబర్ సరిపోల్చుకోవాలి. ఆ తరువాత కంట్రోల్ యూనిట్‌ను బ్యాలెట్ యూనిట్‌కు కనెక్ట్ చేసి స్విచ్ ఆన్ చేయాలి. సిస్టం డిస్‌ప్లే అయ్యేంత వరకు వేచి చూడాలి. ఆ తరువాత టోటల్ బటన్‌ను ప్రెస్ చేసి 17 సి ఫారం-1తో సరిపోయిందా లేదా చూడాలి. ఆ తరువాత కంట్రోల్ యూనిట్ అడ్రస్ ట్యాగ్ తొలగించాలి. పై కవర్ తీసి వేసిన సీల్ తొలగించి తరువాత రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలి. అందులో అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లను 17 సి ఫారం-2లో నమోదు చేయాలి. ఆ ఫారాన్ని కార్బన్ పేపర్ ద్వారా రెండు కాపీలు ఉండేలా చూడాలి. ఓట్ల నమోదు అనంతరం అందులో ఏజెంట్ల సంతకం తీసుకోవాలి. ఒక ప్రతిని తమ వద్ద ఉంచుకుని అసలు ప్రతిని 17 ఫారం-1 కి పిన్ చేసి రో-ఇన్చార్జికి అందజేయాలి.



భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

వీవీ ప్యాట్లు ఇలా లెక్కించాలి

నియోజకవర్గంలో ఎంపిక చేసిన 5 పోలింగ్ కేంద్రాలకు చెందిన వీవీ ప్యాట్లను ఒకదాని తరువాత ఒకటిగా లెక్కించాలి. వీవీ ప్యాట్ స్లిప్స్‌ను సంబంధిత ట్రేలో ఉంచాలి. పూర్తయిన తరువాత 25 చొప్పున కట్టగా కట్టాలి. స్లిప్పులు చిన్నవిగా ఉంటాయి కనుక జాగ్రత్తగా వ్యవహరించాలి. వీవీ ప్యాట్ కౌంటింగ్ అనంతరం ఆర్వో పరిశీలిస్తారు. కౌంటింగ్ ప్రక్రియపై ఆర్వోఓ సంతృప్తి చెందిన తరువాత స్లిప్పులను సంబంధిత బాక్స్‌లో ఉంచి, విధుల్లో ఉన్న ఏఆర్వోకు అప్పగించాలి.

ఈవీఎంలకు మూడంచెల భద్రత

సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లా వ్యాప్తంగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, (ఈవీఎం) కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఉద్యాన కళాశాలలో స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన విషయం తెలిసిందే. ఈ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఇక్కడి భద్రతను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్ కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఈవీఎంలకు భద్రత ఇలా..

- ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో ఉపయోగించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లతో పాటు విలువైన పత్రాలను భద్రంగా ఉంచేలా స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశారు.
- దీనికోసం ప్రత్యేక సదుపాయాలున్న గదిని ఎంచుకుని, డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఈ స్ట్రాంగ్ రూములకు ప్రవేశ ద్వారం ఒక్కటే ఉంటుంది. ఇతర మార్గాల ద్వారా చేరుకోవడానికి వీలుండదు. స్ట్రాంగ్ రూముల వద్ద మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులతో మూడు షిప్టుల్లో 24 గంటలూ భద్రత కల్పిస్తున్నారు.
- వీరితో పాటు స్ట్రాంగ్ రూముల వద్ద అన్ని వైపులా కవరయ్యేలా నిరంతర నిఘాకు సీసీ కెమెరాలు కూడా అమర్చారు. స్ట్రాంగ్ రూముల సెక్యూరిటీ, కారిడార్, సీల్ చేసిన డోర్లు కవరయ్యేలా వీటిని ఏర్పాటు చేశారు. అవసరమైన చోట వీడియోగ్రఫీ కూడా ఏర్పాటు చేశారు. - ఈ సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి, అవి అందిస్తున్న దృశ్యాలను ద్వారా 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు. దీనికోసం గెజిటెడ్, పోలీసు అధికారులు 24 గంటలు విధుల్లో ఉండేలా ప్రణాళిక రూపొందిం చారు.



స్ట్రాంగ్ రూమ్‌ల సీల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

- సీసీ కెమెరాల నిర్వహణకు నిరంతర విద్యుత్ అవసరం. కరెంట్ కోతలు లేకుండా విద్యుత్ శాఖ పక్కా చర్యలు తీసుకుంది.
- స్ట్రాంగ్ రూముల పరిసరాల్లో కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.
- స్ట్రాంగ్ రూములకు ఉన్నత స్థాయి అధికారులను ఇన్చార్జిలుగా నియమించారు. అక్కడికి అనధికార వ్యక్తుల వాహనాలకు అనుమతి ఉండదు.
- భద్రతా వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు.
- స్ట్రాంగ్ రూములను సందర్శించే అవకాశం ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)కి మాత్రమే ఉంటుంది.
- కౌంటింగ్ కేంద్రాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక యంత్రాలతో పాటు జనరేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు.
- రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లను నిర్దేశిత పరిధి వరకూ మాత్రమే అనుమతిస్తున్నారు.
- విజిట్ చేసిన అధికారులు ప్రవేశ ద్వారాల వద్ద సంతకాలు చేసేందుకు లాక్ బుక్ (రిజిస్టర్లు) ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

పైడితల్లికి నృత్యనీరాజనం



నృత్యనీరాజనం చేస్తున్న చిన్నారులు

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్దనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు నేతృత్వంలో అమ్మవారికి నృత్యనీరాజనం అందించారు. అనంతరం చిన్నారులను ఆలయ ఈఓ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్టు భానుకు విశిష్ట బహుమతి



బహుమతి అందుకుంటున్న కార్టూనిస్టు భాను

గరుగుబిల్లి: ప్రముఖ కార్టూనిస్టు గుంట్రెడ్డి భాస్కరరావు(భాను)కు కార్టూన్ల పోటీల్లో విశిష్ట బహుమతి వరించింది. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలి తెలుగు కార్టూనిస్టు తలిశెట్టి రామారావు జయంతి సందర్భంగా ఏటా నిర్వహిస్తున్న కార్టూన్ల పోటీల నేపథ్యంలో ఈ ఏడాది భాను వేసిన కార్టూన్‌కు విశిష్ట బహుమతి వచ్చింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు హర్షవర్ధన్, సంఘ సేవకురాలు సత్యవాణిలు విశిష్ట బహుమతిని సోమవారం తనకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ బహుమతి పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఊబిలో కూరుకుపోయి వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురంలో గల రామప్ప కోనేరులో అదే గ్రామానికి చెందిన పశువుల కాపరి వృద్ధుడు కరెడ్ల వెంకటరమణ(62) ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ త్రిమూర్తులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, వెంకటరమణ ఎప్పటిమాదిరిగా పశువులను కోనేరు సమీపంలోకి మేతకు తీసుకెళ్లాడు. కొద్ది సేపటి తరువాత పశువులు కోనేరులోకి దిగిపోయాయి. ఎంతకీ ఒడ్డుకు రాకపోవడంతో వాటిని తోలేందుకు కోనేరులోకి దిగగా లోతు తెలియక ఊబిలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. చెంతనే పశువులు మేపుతున్న మరో వృద్ధుడు విషయాన్ని గమనించి గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు వచ్చేసరికే వెంకటరమణ మృతిచెందాడు. మృతుడి కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబల్ త్రిమూర్తులు తెలిపారు.

సత్ప్రవర్తనతో ఖైదీల్లో మార్పు



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి

పార్వతీపురంటౌన్: జైలులో ఉండే ఖైదీలకు సత్ప్రవర్తనతోనే మార్పు రావాలని పార్వతీపురం మన్యం జిల్లా జడ్జి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి అ న్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సబ్ జైలు ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ వారికి సరైన ఆరోగ్య తని ఖీలు చేస్తున్నారో లేదోన ని ఆరా తీశారు. మంచి భోజనం , వసతి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలం జైల్లో ఎంతమంది ఖైదీలు ఉన్నారు? అలాంటి వారికి ఇప్పటి వరకూ ఎందుకు బెయిల్ రాలేదని జైలు వార్డెన్ మోహన్‌బాబును అడిగారు. బెయిల్ కోసం దరఖాస్తు చేయని ఖైదీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొన్ని సార్లు క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం గడపవలసి వస్తోందని పేర్కొన్నారు. మీరు జైలులో ఉంటే బయట ఉండే నీ కుటుంబం పరిస్థితి గురించి ఆలోచించారా? అనాలోచిత నిర్ణయాలు మంచిది కాదని బయటకు వచ్చిన తరువాతైనా కుటుంబం కోసం సన్మార్గంలో నడవాలని హితవు పలికారు. ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి జైలు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో విజయం తథ్యం

- ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ ఫలాలే కారణం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎటువంటి వివక్ష లేకుండా నిష్పక్షపాతంగా పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి నాంది పలుకుతాయని, తమను విజయతీరానికి తీసుకువెళ్తాయని వైఎస్సార్‌సీపీ గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన గజపతినగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఎన్ని గిమ్మిక్కులు చేసి అవాకులు, చవాకులు వాగుతున్నప్పటికీ నియోజకవర్గంలో తాను అఖండ మెజార్టీతో విజయం సాధించి తీరుతానని ధీమా వెలిబుచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జూన్ 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారని అప్పలనరసయ్య స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఎలా అయితే విజయం సాధించామో అదేవిధంగా జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని చెప్పారు. ఐదేళ్ల కాలంలో జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాల వల్ల ఎన్నడూ లేని విధంగా అర్ధరాత్రి సమయం వరకు మహిళలు ఓటు వేసేందుకు బారులు తీరి జగన్ మోహన్ రెడ్డిపై వారికున్న అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గారత వుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడివెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, కాలంరాజుపేట గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, కర్రిరామునాయుడు, ఎల్.శ్రీనివాసరావు, డి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల సమస్యల పరిష్కారంపై హామీ

- కలెక్టర్‌ను కలిసి ఉపాధ్యాయ సంఘాలు

విజయనగరం అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కాంపై కలెక్టర్ స్పందించారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మంగళవారం కలిసి ఎన్నిల నిర్వహణలో ఎదుర్కొన్న వివిధ సమస్యలపై రెండుసార్లు వినతి పత్రాలను ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసినట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి పలు సమస్యలను పరిష్కరించడానికి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. శిక్షణ రోజులతో కలిపి డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వడానికి అంగీకరించారన్నారు. అలాగే రిజర్వ్‌లో ఉన్న ఉద్యోగులకు రెమ్యూనరేషన్‌తోపాటు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఒప్పుకున్నారని చెప్పారు. 14వ తేదీ రెమ్యూనరేషన్ చెల్లింపు విషయంలో డ్యూటీ సర్టిఫికెట్ అభ్యంతరం లేదని, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, డి.శ్యామ్, ఈ.రామునాయుడు, కేవీరమణ, షేక్ బుకారీ బాబు, సీహెచ్.పైడితల్లి, రమేష్ చంద్రపట్నాయక్, డి.రాము, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- చదురుగుడిలో కొలువుదీరిన అమ్మవారు
- భక్తులకు ఉచితప్రసాదాలను పంపిణీ చేసిన సేవా సంస్థలు





ఎద్ద చెరువు నుంచి ఊరేగింపుగా చదురుగుడికి పైడితల్లి అమ్మవారిని తీసుకువస్తున్న ఆలయ సిబ్బంది (ఇన్‌సెట్లో) పెడితల్లికి మామిడి పండ్ల నైవేద్యం



పైడితల్లికి భక్తిశ్రద్ధలతో ఘటాల సమర్పణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు వైశాఖమాసం దేవర మహోత్సవం పురస్కరించుకుని మంగళవారం నుంచి చదురుగుడిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, శంబర కృష్ణ, తదితరులు అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. అమ్మవారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మామిడిపండ్లను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారు ఆరు నెలల పాటు ఇక్కడేదర్శన మివ్వనున్నారు. తొలి మంగళవారం కావడంతో అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఘటాలను సమర్పించారు. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు నేత్రత్వంలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక క్యూలైన్‌లు, టెంట్‌లు వేయించారు. మంచినీరు, మజ్జిగ ఉచితంగా సరఫరా చేశారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పులిహోర, మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరుని భక్తులు

ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు సిద్ధం

- ఖరీఫ్‌లో 70000 హెక్టార్లలో వరి సాగు
- జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవశాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్

పార్వతీపురంటౌన్: రాబోయే ఖరీఫ్ సీజన్‌లో 29,283 క్వింటాళ్ల విత్తనాలను (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) రాయితీపై రైతులకు అందించేందుకు ఆర్బీకేల వద్ద సిద్ధం చేశామని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా వ్యవశాయశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 29,283 క్వింటాళ్ల విత్తనాలలో 9981 క్వింటాళ్ల విత్తనాలను షెడ్యూల్డ్ మండలాల్లో గిరిజన రైతులకు 90% రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రాబోయే ఖరీఫ్‌లో వరి పంట దాదాపుగా 70000 హెక్టార్లలో సాగవుతుందని, దీనికి అవసరమైన 26,416 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ కోసం సిద్ధం చేశామన్నారు. గుమ్మలక్ష్మీపుం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు, సీతంపేట మండలాల్లో గిరి శిఖర గ్రామాల్లో చిరు ధాన్యాల సాగును పెద్ద ఎత్తున చేపట్టేందుకు రైతులకు కావలసిన దాదాపు 110 క్వింటాళ్ల చిరు ధాన్యాల విత్తనాలను 90% రాయితీపై సరఫరా చేయడానికి సిద్ధం చేసినట్లు చెప్పారు.

ఆర్బీకేలకు పచ్చిరొట్ట విత్తనాల తరలింపు

తొలకరిలో ఖరీఫ్ పంటకు ముందుగా సాగు చేసే పచ్చిరొట్ట పంటల విత్తనాలైన కట్టిజనుము 820-క్వింటాళ్లు, పిల్లిపెసర-63 క్వింటాళ్లు, జీలుగ-1488 క్వింటాళ్లు విత్తనాలు జిల్లాకు కేటాయించగా (మొత్తంగా 2371 క్వింటాళ్లు), ఇప్పటికే దాదాపు 1300 క్వింటాళ్లు విత్తనాలను ఆర్బీకేలకు తరలించామని, మరో వారం రోజులల్లోగా మిగిలిన విత్తనాలను ఆర్బీకేలకు పూర్తి స్థాయిలో చేరవేయడం జరుగుతుందని తెలిపారు. వీటితో పాటు, కంది 197 క్వింటాళ్లు, అపరాలు 47 క్వింటాళ్లు, వేరుశనగ 206, క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ కోసం సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్బీకేను సంప్రదించి, డీ-కృషి యాప్ (బయోమెట్రిక్ విధానం) ద్వారా వారి వివరాలు రిజిస్టర్ చేసుకుని , రైతు వాటా చెల్లించిన వారికి విత్తనాలను సదరు ఆర్బీకే వద్దనే సరఫరా చేయనున్నట్లు వివరించారు. నిబంధనల మేరకు ఎకరా భూమి కల రైతుకు ఒక ప్యాకెట్ వరి (20 కేజీ) విత్తనం సరిపోతుంది కనుక, గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు ఒక రైతుకు 5 బ్యాగుల విత్తనాలు సరఫరా చేస్తామని, పోయిన సంవత్సరం కూడా ఇదే నిబంధనల మేరకు విత్తన పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా రైతులకు కావలసిన అన్ని రకాల విత్తనాలను, కావాల్సిన పరిమాణంలో ఆర్బీకేల వద్ద సీజన్ ప్రారంభం కాక ముందే తరలించి సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ అధికారి తెలియజేశారు.

ఫెడెక్స్ కొరియర్ కాల్స్‌తో జాగ్రత్త!

- ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం క్రైమ్: ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో వచ్చే కాల్స్‌తో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎం.దీపిక మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. సైబర్ నేరగాళ్ల మోసం చేసే తీరును తెలియజేశారు. ప్రజల మొబైల్స్‌కు ఫోన్ చేసి తాము ఫెడెక్స్ లేదా బ్లూ డాట్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని చెబుతారు. ముందుగా మన చిరునామా, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ వంటి సమాచారాన్ని తెలియజేసి నమ్మిస్తారు. మన అడ్రస్‌తో కొరియర్ బుక్ చేసినట్టు చెబుతారు. కొరియర్ పార్సిల్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు, ఫేక్ పాస్‌పోర్టు, బంగారం వంటివి ఉన్నాయని, మనీల్యాండరింగ్‌కు పాల్పడుతున్నట్టుగా గుర్తించామని బెదిరిస్తారు. మాదక ద్రవ్యాలను తైవాన్, చైనావంటి దేశాలకు పంపుతున్నారని నిర్ధారణ అయ్యిందని, కేసు కూడా నమోదైందని, విచారణ కోసం తాము సూచించిన ప్రాంతానికి దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందన్న సమాచారాన్ని అందిస్తారు. ఫోన్ కాల్‌ను కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులకు కలుపుతామని తెలిపి, వేరే వ్యక్తులకు ఫోన్ కనెక్ట్‌చేసి భయకంపితులను చేస్తారు. రాలేమని చెబితే ఆన్‌లైన్‌లో కూడా దర్యాప్తునకు హాజరుకావచ్చునని, తమకు ఒక లింక్ పంపిస్తున్నామని, వాటిపై క్లిక్ చేసి, స్కైప్‌లో దర్యాప్తునకు హాజరుకావాలని సూచిస్తారు. సైబర్ మోసగాళ్లు పంపిన లింక్ క్లిక్‌చేస్తే చాలు సంబంధిత వ్యక్తుల బ్యాంక్ సేవింగ్ ఖాతాల్లోని నగదు చోరీ చేస్తారు. కొన్నిసార్లు తమతో మాట్లాడిన వివరాలను ఎవరికీ తెలియజేయకుండా గోప్యంగా ఉంచాలని చెప్పి, తమపై నమోదైన కేసులో సహాయం చేస్తామని, చర్యలు నిలిపేస్తామని నమ్మించి, తాము సూచించిన బ్యాంకు ఖాతాకు భారీగా నగదు పంపాలని కోరుతారు. తమ బ్యాంకు ఖాతాను రిజర్వు బ్యాంకు సహకారంతో పరిశీలించాల్సి ఉందని, వివరాలు సేకరించి, ఖాతాలో డబ్బును కాజేస్తారు. ఫెడెక్స్, బ్లూ డాట్ వంటి కొరియర్ సర్వీసులతో వచ్చే నకిలీ కాల్స్‌ను నమ్మి, సైబర్ మోసాలకు గురికావద్దని ఎస్పీ తెలిపారు. ఎవరైనా నగదును పోగొట్టుకుంటే 1930కి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టుచేయాలని కోరారు.

పాఠ్యపుస్తకాల గొడౌన్‌ను సందర్శించిన ఆర్‌జేడీ

విజయనగరం అర్బన్: పట్టణంలో పాఠ్యపుస్తకాల గొడౌన్‌ను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ మంగళవారం సందర్శించారు. జిల్లా నుంచి ప్రతిపాదించిన పుస్తకాలు వచ్చాయా లేదా అన్న దానిపై ఆరా తీశారు. గొడౌన్ నుంచి మండల కేంద్రాలకు జాప్యం లేకుండా వెంటవెంటనే పుస్తకాలు పంపిణీ చేయాలని గొడౌన్ మేనేజర్ ఉమారాణిని ఆదేశించారు.

గంజాయితో ముగ్గురు యువకుల అరెస్ట్

తెర్లాం: గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ మంగళవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం, మెరకముడిదాం మండలాల్లోని రంగప్పవలస, పులిగుమ్మి, రామయ్యవలస గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు 1.5కిలోల గంజాయి తీసుకుని వస్తుండగా తెర్లాం జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్ట్ చేశామని చెప్పారు. వారంతా ఒడిశా రాష్ట్రంలోని సుంకి ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి వారు వినియోగించడమే కాకుండా, మండలంలోని పలు గ్రామాలకు చెందిన మరికొంత మంది యువతకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. దీనిపై నిఘా ఉంచి మంగళవారం ఉదయం ముగ్గురు యువకులు గంజాయి తెస్తుండగా తెర్లాం జంక్షన్ మాటు వేసి పట్టుకున్నామ న్నారు. నిందితుల వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించామని తెలిపారు. ఈ కేసును బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి తెర్లాం, గరివిడి మండలాలకు చెందిన ఆరుగురు యువకులు గంజాయి తరలిస్తుండగా తెర్లాం ఎస్సై రమేష్ వారిని పట్టుకుని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రెండు రోజుల్లో గంజాయితో తొమ్మిది మంది యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.